## క్లుప్తంగా

### సీఎం జగన్‌కు ఆదరణ పెరుగుతోంది

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు

నిడదవోలు: మానవీయ సంస్కరణల ద్వారా రాష్ట్ర ప్రజలకు అన్నివిధాలా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ సీపీ చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుకి పలువురు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుస్తూ ఇప్పటి వరకూ 98.5 శాతం హామీలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ తేజ్, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కొవ్వూరులో జగనన్న పండగ

- ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు
- సందడి చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఐదో సారి ఇక్కడకు విచ్చేస్తున్న జగనన్న
- నేడు కొవ్వూరులో సీఎం బహిరంగ సభ



కొవ్వూరు కూడలిలో ఏర్పాటు చేసిన సీఎం జగన్ భారీ కట్ అవుట్ , ఫ్లెక్సీలు, జెండాలు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా కొవ్వూరులో పండగ వాతావరణం నెలకొంది. పట్టణంలో ఎక్కడ చూసినా సందడే. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా కొవ్వూరులో అడుగు పెడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మూడు రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. ఏప్రిల్ 14న సీఎం కొవ్వూరు పర్యటన ఖరారైనప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా పడింది. తర్వాత మే 5న నిర్వహించాలని భావించినా భారీ వర్షాల వల్ల సాధ్యం కాలేదు. ఈ సభను ఈనెల 24న నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నలభై రోజులుగా ఎదురు చూస్తున్న పార్టీ శ్రేణుల్లో ముఖ్యమంత్రి పర్యటన కొత్త ఉత్సాహాన్ని నింపనుంది. జగనన్న విద్యాదీవెన కార్యక్రమం ప్రారంభోత్సవానికి బుధవారం ఉదయం సీఎం కొవ్వూరు విచ్చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, పార్టీ శ్రేణులు భారీగా ఈ కార్యక్రమానికి తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో కొవ్వూరులో భారీ ఏర్పాట్లు చేశారు. సీఎం రోడ్ షో నిర్వహించే ప్రాంతంలో అడుగడుగునా ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు, తోరణాలతో అలంకరించారు. సభకు వచ్చే మహిళల కోసం సభ ప్రాంగణం వద్ద, పార్కింగ్ ప్రదేశాల వద్ద మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ప్రతి వంద మీటర్లకు ఒక చోట తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు.సీఎం కోసం వేచి చూసేవారి కోసం ఎండలను దృష్టిలో ఉంచుకుని పదిచోట్ల టెంట్లు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తొలిసారిగా కొవ్వూరు నియోజకవర్గానికి వస్తున్నప్పటికీ, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వివిధ పనులపై గతంలో నాలుగుసార్లు ఇక్కడ పర్యటించారు.

**కొవ్వూరుకు సముచిత స్థానం**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంల అధికారంలోకి వచ్చాక ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొందిన తానేటి వనితకు మొదటి క్యాబినెట్‌లోనే స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. మళ్లీ రెండో విడత క్యాబినెట్ విస్తరణలో దళిత సామాజిక వర్గానికి చెందిన వనితకు ఏకంగా హోం శాఖ మంత్రి పదవిని కట్టబెట్టడం ద్వారా కొవ్వూరు నియోజకవర్గానికి ప్రాధాన్యం కల్పించారు.



కొవ్వూరులో సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం



వాహనాల పార్కింగ్ వద్ద స్త్రీల కోసం ఏర్పాటు చేసిన మొబైల్ మరుగుదొడ్లు



కొవ్వూరులో హెలిప్యాడ్ వద్ద రహదారి నిర్మాణ పనుల్లో కార్మికులు

# సీఎం బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు

- హోం మంత్రి తానేటి వనిత
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వేణు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి తదితరులు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వూరు పర్యటనకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఇక్కడ ప్రారంభిస్తారన్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు సీఎం బహిరంగ సభ ప్రారంభం అవుతుందన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, ఇతర అధికారులతో కలిసి సీఎం సభ ఏర్పాట్లను మంత్రి వనిత పరిశీలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా హోం మంత్రి వనిత మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము చెల్లింపులో గతం ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. టీడీపీ హయాంలోని బకాయిలు రూ.1,700 కోట్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యాదీవెన, అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యాకానుక పథకాలతో పాటు నాడు-నేడు ద్వారా రాష్ట్రంలోని విద్యాసంస్థల రూపురేఖలను మార్చామన్నారు. రాజకీయాల కోసం కాకుండా పేదింటి పిల్లల ఉన్నత చదువులకు అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు, పచ్చ మీడియా ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపైనా బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆమె విమర్శించారు. కాగా ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి రోడ్ షో ట్రయిల్ రన్ నిర్వహించారు.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, పార్టీ కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఎస్.రాజీవ్‌కృష్ణ, గన్నమని వెంకటేశ్వరరావు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి, జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, చైత్ర వర్షిణి తదితరులు పాల్గొన్నారు.




కొవ్వూరులో సీఎం బహిరంగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం జక్కంపూడి రాజా, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు,రుడా చైర్‌పర్సన్ షర్మిళారెడ్డి తదితరులు

## జల వనరులను ఆదా చేద్దామంటూ ప్రతిజ్ఞ



జల వనరులను ఆదా చేద్దామంటూ రైతులు, కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో శ్రీనివాసరావు

**నల్లజర్ల:** జల వనరులను ఆదా చేస్తే భవిష్యత్తు తరాల మనుగడకు ఇబ్బందులు ఉండవని నల్లజర్ల సెక్షన్ ఫారెస్ట్ డీఆర్వో చెల్లా శ్రీనివాసరావు రైతులకు, కూలీలకు వివరించారు. లైఫ్ (పర్యావరణహిత జీవనం)పై మంగళవారం నల్లజర్ల బుచ్చాల చెరువు వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటోందన్నారు. తద్వారా జీవ వైవిధ్యానికి హాని కలుగుతోందన్నారు. జలవనరులు, అడవులు, జీవరాసులను కాపాడతామంటూ రైతులు, కూలీలతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని శ్రీనివాసరావు సూచించారు. చెరువు పరిసరాల్లోని ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను ఏరివేయించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

## ఘనంగా గోగులమ్మ జాతర

**నిడదవోలు రూరల్:** మండలంలోని కలవలచర్ల గ్రామ దేవత అయిన గోగులమ్మ వారి జాతర మహోత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో అమ్మవారి బలిచేట కార్యక్రమం జరిపించారు. విచిత్ర వేషధారణలు, బుట్టబొమ్మలు, విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. బుధవారం జరిగే అమ్మవారి నైవేద్యాల సందర్భంగా గ్రామంలో జాతరకు వచ్చిన ఆడ పడుచులు, బంధువులతో పండుగ వాతావరణం సంతరించుకుంది.



## రోగులకు భోజన పొట్లాల పంపిణీ

**నిడదవోలు:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులకు మంగళవారం భోజన పొట్లాలు పంపిణీ చేశారు. నిడదవోలు రోటరీ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో సత్యసాయి నిత్యాన్నదాన ట్రస్టు ద్వారా వాటిని అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుంపుల వెంకటేశ్వరరావు, కాకులపాటి శ్రీధర్, గెల్లా రాజు, తుమ్మెద సత్తి రాజు, ఇంజే శేఖర్, ఫణిసింహ, రాచర్ల చైతన్య పాల్గొన్నారు.

# ఔషధాల ఫ్రూట్ డ్రాగన్

- సాగు చేపట్టిన అభ్యుదయ రైతులు
- ఒక సారి పెట్టుబడి .. 25 ఏళ్ల పాటు రాబడి

**నల్లజర్ల:** అందరూ పండించే పంటలు వేయకుండా ఆ ఇద్దరు యువకులు డ్రాగన్ ఫ్రూట్ సాగును ఎంచుకున్నారు. ఔషధ గుణాలు ఎక్కువగా ఉండే డ్రాగన్ పండ్లకున్న డిమాండ్ గురించి తెలుసుకున్నారు. సంగారెడ్డి, గుంటూరు జిల్లా వేమవరం, రంగారెడ్డి జిల్లా ఆరుట్ల, పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం తదితర ప్రాంతాల్లో నెల పాటు విస్తృతంగా పర్యటించి ఏయే రకాల సాగు ఆశాజనకం అనే విషయాలను అధ్యయనం చేశారు. గతేడాది ఫిబ్రవరిలో తైవాన్ పింక్, సీఎం రెడ్, మెరాకిన్ రెడ్, తైవాన్ వైట్, అమెరికన్ బ్యూటీషన్, ఇజ్రాయిల్ గోల్డ్ విత్తనాలు తీసుకువచ్చి ప్లాస్టిక్ సంచులలో కొంత కాలం పెంచారు. అవి బాగా వేర్లు వచ్చాక తొలుత అర ఎకరం పొలంలో మండలంలోని మొట్టమొదటి సారిగా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు. వారే నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన అభ్యుదయ రైతులు యద్దనపూడి లక్ష్మణస్వామి, కానుబోయిన రాము. నాటిన 9వ నెల నుంచి 25 ఏళ్లపాటు డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయాన్ని (ఫిబ్రవరి నుంచి నవంబరు వరకు)పొందవచ్చని వారు చెబుతున్నారు. ఈ సాగుకు మెట్ట ప్రాంత భూములు అనుకూలం.

**సాగు ఇలా..**

ఆరడుగుల ఎత్తు ఉండే సిమెంట్ స్థంబాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ మట్టల నుంచి సేకరించిన విత్తనాన్ని సిమెంట్ స్థంభాల చుట్టూ నాటుకోవాలి. మూడు నెలల్లో సిమెంట్ స్థంభం చుట్టూ మొక్క విస్తరిస్తుంది. మరో ఆరు నెలల తర్వాత ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్స్ వస్తాయి. విస్తారంగా ఫలసాయం పొందాలంటే నవంబరు-ఫిబ్రవరి మధ్య వచ్చే పూతను ఎప్పటి కప్పుడు తొలగించడం ఉత్తమం. అలా చేస్తే ఫిబ్రవరి నుంచి ఎక్కువ ఫలసాయం వస్తుంది. ఎకరానికి నాలుగు నుంచి పది టన్నుల వరకూ ఫ్రూట్స్ దిగుబడి వస్తుందని అభ్యుదయ రైతులు లక్ష్మణస్వామి, రాము చెబుతున్నారు. చీడపీడలు ఆశించే అవకాశం లేకపోవడంతో రసాయన ఎరువులు, పురుగుల మందులను వినియోగించాల్సిన అవసరం లేదు. డ్రిప్ పద్ధతిలో రెండు రోజులకు ఒకసారి నీటిని అందించాలి. ఫ్రూట్ తొలగించిన రెబ్బల (మట్టలు) నుంచి సొంతంగా విత్తనం తయారు చేసుకోవడం ద్వారా రైతు అదనపు ఆదాయం కూడా పొందవచ్చు. సేంద్రియ ఎరువుల వినియోగంతో పండు నాణ్యత పెరుగుతందని, రుచి పెరిగి ఎక్కువ రోజుల పాటు నిల్వ కూడా ఉంటుందని వివరించారు.



రెండు ఎకరాలలో ఆరు రకాల డ్రాగన్ ఫ్రూట్ సాగు



డ్రాగన్ ఫ్రూట్స్‌తో..

**అబ్బురపరిచే ఔషధ గుణాలు..**

పుచ్చకాయ లాగానే తియ్యని రుచి కలిగిన డ్రాగన్ ఫ్రూట్‌లో అబ్బురపరిచే ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, తెల్ల రక్త కణాలు, పేగులకు మేలు చేసే 400 రకాల బ్యాక్టీరియా వృద్ధి, మలబద్ధకం నివారణ, రోగనిరోధక శక్తి పెంపొందించడం, జీర్ణాశయ రుగ్మతలను తొలగించే పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి.

**ఆసక్తితోనే..**



డ్రాగన్ ఫ్రూట్‌కు ఉన్న డిమాండ్‌ను చూసి సాగు చేయాలనే ఆసక్తి కలిగింది. ఐదు జిల్లాల్లో తిరిగి ఈ పంట సాగు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేశాం.సాగు, సంరక్షణ, సస్యరక్షణలపై అవగాహన వచ్చింది. విత్తన రెబ్బలు తెచ్చి మట్టి సంచులలో నారు పెంచాక భూమిలో నాటాం. మొదట రెండు ఎకరాలలో వేశాను. మిగిలిన 8 ఎకరాలలో వివిధ పంటలు పూర్తయిన తర్వాత ఇదే సాగు చేయాలనే యోచన.తొలకరి వర్షాల తర్వాత పూర్తిస్థాయి కాపు వస్తుంది.

– యద్దనపూడి లక్ష్మణస్వామి, రైతు, నబీపేట

**ప్రయోగాత్మకంగా..**



నాకున్న ఐదెకరాల భూమిలో తొలుత ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ పంట వేసే ఉద్దేశంతో నారు పెంచుతున్నాను. ప్రస్తుతం 60 సెంట్లలో పంట వేశాను. ఎప్పుడూ సాధారణ పంటలే కాకుండా కొత్త తరహాలో సాగుచేయాలన్నదే లక్ష్యం.

– కానుబోయిన రాము,రైతు, నబీపేట

**అర ఎకరానికి రూ.1.84 లక్షల సబ్సిడీ**



ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ పెంపకానికి అర ఎకరానికి రూ.1.84 లక్షలు సబ్సిడీగా అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో తొలిసారిగా ఉపాధి హామీ పథకంలో డ్రాగన్ ఫ్రూట్ వేసింది ఇక్కడే. ఈ మొత్తాన్ని మొక్కల నిర్వహణకు అందిస్తాం.అర ఎకరానికి 220 మొక్కలు వేయాల్సి ఉంటుంది.ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– పి.సత్యనారాయణ, ఏపీఓ, ఉపాధిహామీ, నల్లజర్ల మండలం



## డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శేషబ్రహ్మం



శేషబ్రహ్మం



మోహన్ కృష్ణకుమార్

**నల్లజర్ల:** డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా నల్లజర్లకు చెందిన పి.శేషబ్రహ్మం ఎన్నికైనట్టు ఆ సంస్థ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.నరహరి తెలిపారు. నల్లజర్లలో మంగళవారం నిర్వహించిన డీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.మోహన్ కృష్ణకుమార్, ఉపాధ్యక్షులుగా వి.ఉమాబాయి, బి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా కె.అప్పలాచారి, జి.రాంబాబు, ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా కె.త్రినాథరావు, కె.నరహరి తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.అప్పలాచారి వ్యవహరించారు.

## రోడ్డు ప్రమాదంలో నిడదవోలు వాసికి గాయాలు

**గండేపల్లి:** జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో నిడదవోలు వాసికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. నిడదవోలుకు చెందిన భార్యాభర్తలు గరికపాటి శ్రీను, గౌతమి, కుమారుడు యశ్వంత్‌తో కలిసి తెల్లవారుజామున మోటారుసైకిల్‌పై అన్నవరం వెళ్లారు. అక్కడ వ్రతమాచరించుకుని, స్వామివారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో మల్లేపల్లి శివారు కరుణకుమార్ దాబా సమీపంలోకి వచ్చేసరికి శ్రీనుకు కునుకుపాట్లు పడడంతో ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనుకు గడ్డం, కుడి కన్ను పైభాగంలోను తీవ్ర గాయమైంది. ప్రయాణికులు, స్థానికులు అతడిని గండేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## మల్లవరంలో ఫ్యామిలీ డాక్టర్

**చాగల్లు:** మండలంలోని మల్లవరం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కొండపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు పి.రవికుమార్ సుమారు 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడిగా 'ఈద్పుగంటి'



ఈద్పుగంటి నాగేశ్వరరావు

**దేవరపల్లి:** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా ఈద్పుగంటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు పదవీ కాలం పూర్తవడంతో నూతన అధ్యక్షుడిగా నాగేశ్వరరావు నియమితులయ్యారు. జూన్‌లో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తుందని ప్రస్తుత అధ్యక్షుడు సూర్యప్రకాశరావు తెలిపారు.

# రంగు చూసి మోసపోవద్దు



ఆకర్షణీయమైన రంగుతో మార్కెట్‌లో విక్రయిస్తున్న మామిడి పండ్లు

**నల్లజర్ల:** పండ్లలో రారాజుగా చెప్పుకునే మామిడికి ఉన్న డిమాండ్ మరే ఫలానికి ఉండదేమో. వేసవి వచ్చింటే నల్లజర్ల జంక్షన్‌లోనే కాదు, రహదారి పక్క మార్జిన్‌లలోనూ మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. పరిసర ప్రాంతాల్లో మామిడి పంట తక్కువగా ఉండడంతో ఇక్కడ విక్రయిస్తున్న మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా విక్రయించేందుకు తక్కువ సమయంలోనే మామిడి కాయలను పక్వానికి తేవడానికి వ్యాపారులు ఆరోగ్యానికి హానికరమైన కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. గతంలో ఇటువంటి కృత్రిమ పద్ధతుల ద్వారా కాకుండా ఓ గదిలో ఎండు గడ్డి వేసి మాగబెట్టేవారు. సహజ సిద్ధమైన ఈ పద్ధతిలో మామిడి కాయలు పక్వానికి రావడానికి కనీసం వారం రోజులు పట్టేది. ప్రకృతి సిద్ధంగా పండిన మామిడి రుచిగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి చేటు చేయదు. కానీ ఇటీవల తక్కువ సమయంలో విక్రయాలకు పండ్లను సిద్ధం చేయడానికి కార్బైడ్ వినియోగం ఎక్కువైంది. వాస్తవానికి కార్బైడ్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించినా చాటుమాటుగా ఇంకా అక్కడక్కడా వినియోగం జరుగుతూనే ఉంది. దీనివల్ల కాయ రంగు పసుపు పచ్చగా మారి నోరూరిస్తుంది. తీరా ఇంటికి వెళ్లి కోసి చూస్తే లోపలంతా పచ్చి. రుచిగా ఉండదు. అంతేకాకుండా కార్బైడ్ వినియోగించిన మామిడి పండ్లను తినడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్ వంటి జబ్బులు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎసిటిలిన్ వాయువులో పాస్ఫిన్, ఆర్సిన్ అనే వాయువులు ఉండడం వల్ల ఈ పండ్లను తిన్న మనిషి నాడీ వ్యవస్థ, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుంది. తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, జ్ఞాపక శక్తి కోల్పోవడం తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఉద్యానశాఖాధికారి చెబుతున్నారు.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు**

దీనిపై నల్లజర్ల ఉద్యాన అధికారి శ్రీలక్ష్మిని 'సాక్షి' వివరణ కోరింది. కార్బైడ్ వినియోగం ప్రాణాంతకం అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై ఆహార కల్తీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్బైడ్ వినియోగం వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక మొత్తంలో మామిడి పండ్లను మాగపెట్టదలచిన వారు ఉద్యాన యూనివర్సిటీలో రైపెనింగ్ చాంబర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఇక్కడ ఎలాంటి రసాయనాలు వేయకుండా నామమాత్రపు ఫీజుతో సహజ సిద్ధంగా మామిడి కాయలు మగ్గపెట్టేందుకు ఏర్పాట్లు ఉన్నాయన్నారు.

## తాళ్లపూడి మండలం నుంచి 53 బస్సులు

**తాళ్లపూడి:** తొలిసారిగా బుధవారం కొవ్వూరు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాదీవెన సభను విజయవంతం చేయాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు మంగళవారం కోరారు. హోం మంత్రి తానేటి వనిత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వస్తున్నందున మండలం నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో బహిరంగ సభకు తరలి వెళతామన్నారు. మండలం నుంచి 53 బస్సులు, 40 కార్లు, 300కు పైగా మోటార్‌సైకిళ్లపై సుమారు మూడు వేల మంది తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

## ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

**ఉండ్రాజవరం:** ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా మండలంలోని వేలివెన్ను గ్రామంలో తెలుగుదేశం పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన జిల్లా స్థాయి మినీ మహానాడులో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం పైన, సీఎం జగన్ మోహన్‌రెడ్డిపైన విమర్శలకు పరిమితమయ్యారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇన్‌చార్జులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



గోపాలపురం -భీమోలు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

**గోపాలపురం:** ఇక్కడి నుంచి మండలంలోని భీమోలు గ్రామం వరకూ నిర్మిస్తున్న రోడ్డును ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం పరిశీలించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదన్నారు. భీమోలు గ్రామస్తులకిచ్చిన మాట ప్రకారం రూ.1.70 కోట్ల వ్యయంతో ఈ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. మరో రూ.30 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో భీమోలు ఊరి వద్ద, గోపాలపురంలో అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల వరకూ సిమెంట్ రోడ్డు నిర్మిస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్ సూచించారు. అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

# సంక్షేమ ఆశయ సారథులు వలంటీర్లు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పోతవరంలో వలంటీర్లకు వందనం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు

**నల్లజర్ల:** సంక్షేమ పథకాలను పేదల వద్దకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పోతవరం-1,-2 సచివాలయాల పరిధిలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేస్తున్నందు వల్లే ప్రభుత్వానికి, తనకు మంచి పేరు వచ్చిందన్నారు. ఇదే తరహాలో రాగద్వేషాలకు అతీతంగా ప్రభుత్వ విధులను నిర్వర్తించాలని వలంటీర్లకు ఆయన సూచించారు. విప్లవాత్మకమైన వలంటీర్ల వ్యవస్థపై దేశంలోనే అధ్యయనం జరుగుతోందన్నారు. గెడ్డం తేజశ్రీకి సేవారత్న, మరో 40 మందికి సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య, నల్లజర్ల, పోతవరం సొసైటీల అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని కురుకూరు, లక్ష్మీపురం, ధుమంతునిగూడెం, పల్లంట్ల గ్రామాల గ్రామ వలంటీర్లకు పల్లంట్ల గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సేవా పురస్కారాలను ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు అందజేశారు. వలంటీర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచపూడి సతీష్, పల్లంట్ల సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు రాయుడు వెంకట్రావు, కృష్ణంపాలెం ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రేపు వలంటీర్లకు పురస్కారాలు

**నిడదవోలు రూరల్:** మండలంలోని పలు గ్రామాల పరిధిలోని వలంటీర్లకు ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు సేవా పురస్కారాలు అందజేయనున్నట్టు ఎంపీడీఓ టి.మూర్తిబాబు మంగళవారం తెలిపారు. నిడదవోలులోని కాపు కల్యాణ మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కోరుమామిడి, తాడిమళ్ల, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, సూరాపురం, తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

### ముమ్మరంగా ఉపాధి పనులు

**చాగల్లు:** ఉపాధి హామీ పనులు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయని ఎంపీడీవో బి.రాంప్రసాద్ తెలిపారు. పంట కాలువల్లో పూడిక తొలగింపు, డ్రైన్లలో పూడికతీత, చెరువుల తవ్వకం వంటి పనులు చేస్తున్నారని వివరించారు. జాబ్ కార్డు ఉండి పని కావల్సిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తున్నామని చెప్పారు. మంగళవారం సుమారు రెండు వేల మంది కూలీలు పనులకు హాజరైనట్టు తెలిపారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఎంపీడీవో పరిశీలించారు. కూలీల హాజరు శాతాన్ని తనిఖీ చేసి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచనలు చేశారు.

## ధాన్యాన్ని స్థానిక మిల్లులకే కేటాయించాలి

**పెరవలి:** తాము పండించిన ధాన్యాన్ని ఇతర జిల్లాల మిల్లులకు కాకుండా, తమ గ్రామంలోని మిల్లులకే కేటాయించాలని కోరుతూ మండలంలోని అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల రైతులు మంగళవారం అన్నవరప్పాడు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేశారు. దాంతో గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పెరవలి పోలీసులు, నిడదవోలు, పెనుగొండ ఎస్‌ఐలు వచ్చి నచ్చజెప్పినా రైతులు వెనక్కు తగ్గలేదు. అనంతరం అక్కడకు వచ్చిన తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి ఆందోళన విరమించాలని రైతులను కోరారు. ఆమె సమస్యను ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. తాను కలెక్టర్‌తో మాట్లాడి, ధాన్యాన్ని స్థానిక మిల్లులకే తరలించే ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చా రు. ఈ విషయం తహసీల్దార్ రైతులకు చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.అనంతరం రైసుమిల్లర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రైతుల ధాన్యాన్ని కొనుగోలుకు ఆదేశాలిచ్చారు.

## ఆసరా లేని కుటుంబానికి రేషన్ డిపో

- అండగా నిలిచిన ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



పెరవలిలో రేషన్ డిపో డీలర్ నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

**పెరవలి:** మగ దిక్కులేని లంకమాలపల్లికి చెందిన ఓ కుటుంబానికి నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఉపాధి కల్పించి అండగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామంలోని పాలమూరి లక్ష్మి, పింకీ తల్లీకూతుళ్లు. ఇటీవల కొద్ది నెలల వ్యవధిలోనే పింకీ తాత, తండ్రి, సోదరుడు మృతి చెందారు. దాంతో ఆ కుటుంబానికి జీవనాధారం లేకుండా పోయింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవల లంకమాలపల్లి వచ్చిన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిని ఆ తల్లీకూతుళ్లు కలసి తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. ఇల్లు గడవడానికి తమకు రేషన్ డిపో కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్పందించి తహసీల్దార్ టి.రాజరాజేశ్వరితో మాట్లాడారు. పింకి ఇంటర్ చదువుకోవటంతో రేషన్ డిపోను మంజూరు చేశారు. ఆ ఉత్తర్వుల కాపీని పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి మంగళవారం పెరవలిలో పింకీకి అందించారు. తల్లి, కుమార్తెలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.